# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 24-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమైంది.
- పర్యాటక రంగం పరిశ్రమగా మాత్రమే కాక.. వివిధ సంస్కృతుల మధ్య వారధిగా ఉంటూ ఆర్థిక అవకాశాలను ప్రోత్సహిస్తుందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.
- ఏ ప్రజాస్వామ్యానికైనా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా పునాది అని భారత ముఖ్య ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ అన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపటి నుండి రెండు రోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు.

=============================

పర్యాటక రంగం పరిశ్రమగా మాత్రమే కాక.. వివిధ సంస్కృతుల మధ్య వారధిగా ఉంటూ ఆర్థిక అవకాశాలను ప్రోత్సహిస్తుందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ (USISPF) నిర్వహించిన పర్యాటక నాయకత్వ శిఖరాగ్ర సదస్సులో ఉప రాష్ట్రపతి పాల్గొని ప్రసంగించారు. “సాఫ్ట్ డిప్లొమసీ” కోసం పర్యాటకం ఒక శక్తివంతమైన సాధనమని, భారత్-అమెరికా ఆర్థిక సహకారాలలో ఇది ఒక కీలక స్తంభమని ఆయన అభివర్ణించారు. పర్యాటక రంగం అత్యధిక ఉపాధిని కల్పించే రంగాలలో ఒకటిగా ఉందని ఉప రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

ఇదే కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్ మాట్లాడుతూ... భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దార్శనికతలో పర్యాటక రంగం కేంద్ర బిందువుగా ఉందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం - అమెరికా మధ్య 16వ విడత జాయింట్ స్పెషల్ ఫోర్సెస్ వ్యాయామం `వజ్ర ప్రహార్` (VAJRA PRAHAR) హిమాచల్ ప్రదేశ్‌లో ఈరోజు ప్రారంభమైంది. ఈ విన్యాసాలు వచ్చే నెల 16వ తేదీ వరకు కొనసాగుతాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని బక్లోలో ఉన్న స్పెషల్ ఫోర్సెస్ ట్రైనింగ్ స్కూల్ లో ఈ విన్యాసాలు జరుగుతున్నాయని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత సైన్యం తరపున స్పెషల్ ఫోర్సెస్ యూనిట్లకు చెందిన 45 మంది సిబ్బంది, అమెరికా తరపున యూఎస్ స్పెషల్ ఫోర్సెస్ గ్రీన్ బెరెట్స్ (Green Berets) కు చెందిన 12 మంది సిబ్బంది పాల్గొన్నారు. ప్రత్యేక ఆపరేషన్ల వ్యూహాలను పరస్పరం పంచుకోవడం ద్వారా భారత్ - అమెరికాల మధ్య సైనిక సహకారాన్ని పెంపొందించడమే ఈ విన్యాసాల ప్రధాన లక్ష్యం.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నూతన కార్యాలయం "సేవా తీర్థ్"లో ... కేంద్ర మంత్రివర్గం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు సమావేశమైంది.  కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు సమావేశం వివరాలను వెల్లడించారు. కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపిందని, పేరు మార్పు బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదానికి పంపుతామని మంత్రి తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తరువాత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామని చెప్పారు. 9 వేల 72 కోట్ల రూపాయల  అంచనా వ్యయంతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్, జార్ఖండ్‌లోని 8 జిల్లాలను కలుపుతూ నిర్మించే మూడు రైల్వే ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. శ్రీనగర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో  1,677 కోట్ల రూపాయలతో సివిల్ ఎన్‌క్లేవ్ అభివృద్ధికి, గుజరాత్‌లో గిఫ్ట్ సిటీ నుండి షాపూర్ వరకు మెట్రో విస్తరణకు ఆమోదం లభించినట్టు అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నలుగురు మావోయిస్టు కీలక అగ్రనేతలు ఈరోజు హైదరాబాద్‌లో తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు డీజీపీ విలేకరుల సమావేశంలో వివరాలను ప్రకటించారు. తిప్పిరి తిరుపతి అలియాస్ దేవూజీ, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, బడే చొక్కారావు అలియాస్ దామోదర్, నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్నలు లొంగిపోయినట్లు డిజిపి తెలిపారు. ఈ కీలక నేతల లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్ల ఉద్యమం బలహీనపడిందని, మావోయిస్టులు అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారని ఆయన అన్నారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు డీజీపీ 25 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. వీరికి భద్రతతో పాటు ప్రభుత్వ పరంగా పునరావాస కల్పనపై హామీ ఇచ్చారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏ ప్రజాస్వామ్యానికైనా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా పునాది అని భారత ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు భారత ఎన్నికల సంఘం (ECI) నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల జాతీయ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) గురించి మాట్లాడుతూ... అర్హత ఉన్న ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండాలని, అనర్హుల పేర్లను తప్పనిసరిగా తొలగించాలని స్పష్టం చేశారు. ప్రత్యేక సవరణ ప్రక్రియ బీహార్‌లో ప్రారంభమైందని, ఎటువంటి అభ్యంతరాలు (Appeals) లేకుండా అత్యంత పారదర్శకంగా, దోషరహితంగా పూర్తయిందని వివరించారు. ఈ ప్రక్రియ ఆ తర్వాత మరో 12 రాష్ట్రాల్లో కొనసాగిందని.. అందులో 11 రాష్ట్రాల తుది ఓటర్ల జాబితా ఇప్పటికే

ప్రచురించబడిందని ఆయన తెలిపారు. ఓటర్ల జాబితాను కేవలం స్వచ్ఛంగా మార్చడంతో పాటు.. సులభంగా అందుబాటులో ఉండేలా చేయడం కూడా ముఖ్యమని భారత ముఖ్య ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ తెలియజేస్తూ…

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపటి నుండి రెండు రోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. రాజధాని టెల్ అవీవ్‌లో ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుతో ప్రధానమంత్రి విస్తృత స్థాయి చర్చలు జరపనున్నారు. అనంతరం జెరూసలేంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇజ్రాయెల్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించనున్న తొలి భారత నాయకుడిగా నరేంద్ర మోదీ నిలవనున్నారు. ఇజ్రాయెల్‌లోని భారత సంతతి వ్యక్తులతో ముఖాముఖి కార్యక్రమం, సాంకేతిక ప్రదర్శనలో పాల్గొంటారు. ఈ పర్యటనలో ఇన్నోవేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), సైబర్ సెక్యూరిటీ, క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాలపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. చర్చల అనంతరం పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. ఇజ్రాయెల్‌లో భారత రాయబారి జె.పి. సింగ్.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనను చారిత్రాత్మకం అని అభివర్ణించారు. ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ… ఉగ్రవాదం విషయంలో భారత్, ఇజ్రాయెల్‌లు ఒకే మాటపై ఉన్నాయని, కష్టకాలంలో ఇరు దేశాలు ఒకదానికొకటి అండగా నిలిచాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఉన్న కార్మికుల ఆరోగ్య సంరక్షణ, క్షేమాన్ని ప్రభుత్వం కోరుకుంటున్నదని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ESIC) 75వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా 40 ఏళ్లు పైబడిన కార్మికుల కోసం వార్షిక ఆరోగ్య శిబిరాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… కొత్త కార్మిక చట్టాల అమలు సామాజిక సంక్షేమ కార్యక్రమాలతో ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ…

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐసిసి పురుషుల టీ-20 ప్రపంచ కప్ లో భాగంగా సూపర్- 8 గ్రూప్-2 విభాగంలో శ్రీలంకలోని పల్లెకెలె స్టేడియం వేదికగా ఇంగ్లాండ్, పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన పాకిస్థాన్ 18 ఓవర్లకు 7 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =